క్లుప్తంగా

కంప చెట్లు తొలగించండి

చాపాడు : మండల పరిధిలోని రాజకొట్టాలు రోడ్డు మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలని మండలంలోని గాంధీ నగరం గ్రామానికి చెందిన ముదిరెడ్డి నాగ సుబ్బారెడ్డి శుక్రవారం జిల్లా కలెక్టర్ తోలేటి శివశంకర్‌ను కోరారు. మండలంలోని గాంధీనగరం నుంచి మైదుకూరుకు వెళ్లే రోడ్డులో ఉండే రాజకొట్టాలు గ్రామం వద్ద రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగాయి. దీని వలన రోడ్డున ప్రతి రోజూ వెళ్లే విద్యార్థులు, సామాన్య ప్రజలు, వాహణదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు సౌకర్యార్థం కంపచెట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కలసపాడు : సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా మండలంలోని కలసపాడు, తెల్లపాడు గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుండి 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిచివేస్తున్నట్లు ఏఈ రమేష్‌బాబు తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు, రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం


బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు

ప్రొద్దుటూరు : స్థానిక విజయకుమార్ సర్కిల్ వద్ద బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. బీజేపీపై అభిమానం ఉన్న వారందరూ సభ్యత్వం నమోదు చేయించుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి అర్కటవేముల హరినారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం మాజీ కార్యదర్శి నరేష్, బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ పర్లపాడు గౌరీశంకర్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి పృథ్వీ నారాయణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేంద్ర, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

పోరుమామిళ్ల : చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ఈదులపల్లెలో శుక్రవారం ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. 'మీకు తెలుసా' కార్యక్రమం కింద జరిగిన సదస్సులో హెచ్ఐవీ, ఎయిడ్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఖాదర్‌బాషా, సీసీ పోలయ్య, పుల్లయ్య, సుజాత, సీహెచ్ఓ దుర్గాదేవి, సభ్యులు పాల్గొన్నారు.

17 నుంచి పారిశుధ్య కార్యక్రమాలు

చాపాడు : అక్టోబరు 2న మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ దివాస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 1 వరకు మండల వ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమాల్లో మొక్కలు నాటడం, పారిశుధ్య పనులు చేపట్టడం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ వంటి చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీడీఓ తెలియజేశారు.

గుండెపోటుతో డ్రైవర్ మృతి

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ మహబూబ్‌నగర్‌కు చెందిన షేక్ మహబూబ్(48) ప్రైవేటు ట్రావెల్ బస్సులో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రాత్రి బస్సుకు డ్రైవర్‌గా వెళ్లిన మహబూబ్ హైదరాబాద్ సరిహద్దులో శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ బద్వేల్ అసెంబ్లీ కోకన్వీనర్ పల్లెంశెట్టి పందరి విజ్ఞప్తి చేశారు. మహబూబ్ కుటుంబానికి సంతాపం తెలిపారు.

పంటలసాగులో మెలకువలు అవసరం

కడప అగ్రికల్చర్: వాతావరణ మార్పుల నేపథ్యంలో పంటలసాగులో రైతులకు మెలకువలు చాలా అవసరం అని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. శ్రీనివాసాచారి అన్నారు. కడప ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ఈ నెల 5వ తేదీ నుంచి 13వ తేదీ వరకు 'ప్రధాన పంటల్లో పురుగులు - తెగుళ్ల యాజమాన్యం' పైన ఆత్మ సౌజన్యంతో గ్రామీణ యువతకు శిక్షణతో కూడిన నైపుణ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసాచారి, జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు, ఆత్మ పీడీ విజయలక్ష్మి, కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య, ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్‌లు హాజరయ్యారు. శ్రీనివాసాచారి మాట్లాడుతూ పంటలసాగులో పురుగులు, తెగుళ్లతో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు మాట్లాడుతూ పంటలసాగుకు అవసరం మేరకు నీటి తడులను అందించాలన్నారు. కలుపు మందుల వాడకంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆత్మ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు.

ప్రైవేట్ పరం చేయడం తగదు



కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది అనుకుంటే పొరబాటే. పేద ప్రజలపై భారం మోపేందుకు అనేక అడ్డదారులు తొక్కుతోంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలలో ఫీజులు తక్కువగా వుంటాయని, సూపర్ స్పెషాలిటీ వైద్యం పేదలకు అందుబాటులోకి వస్తుందని ప్రజలు ఎంతో ఆశపడ్డారు. అయితే ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ప్రస్తుతం వున్న కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలనుకోవడం తగదు. ఇది పేద విద్యార్థులను మోసం చేయడమే. ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలి.

- సుబ్బారావు, కడప



ప్రజలకు మేలు చేయాలి



నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఒక్కొక్కటే తీసివేస్తూ రావడం బాధాకరం. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను తుంగలో తొక్కి ప్రజల నడ్డి విరుస్తోంది. గత ప్రభుత్వం కొత్త మెడికల్ కళాశాలలను మంజూరు చేయించింది. దీనివల్ల రాష్ట్రానికి అదనంగా దాదాపు 1800 మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల ఆశలపై ఈ కూటమి ప్రభుత్వం నీరు చల్లుతోంది. మెడికల్ కళాశాలల విషయంలో ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా మెడికల్ సీట్లు పేద విద్యార్థులకు దక్కకుండా ప్రైవేటుకు అప్పజెప్పాలనుకుని నిర్ణయించుకోవడం దుర్మార్గపు చర్య.

- సోదాదాసి శామ్యూల్‌రాజ్, కడప

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం


మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ యనమల సిద్ధార్థ్ యాదవ్


మాట్లాడుతున్న అర్బన్ ఎస్ఐ ఘన మద్దిలేటి

ప్రొద్దుటూరు : యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల వారి భవిష్యత్తు నాశనం అవుతుందని ఎక్సైజ్ ఎస్ఐ యనమల సిద్ధార్థ్ యాదవ్ తెలిపారు. స్థానిక రెండో వార్డు మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం మాదక ద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా ఉమ్మడి కడప జిల్లా స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్(కువైట్) ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరాదారులు, వినియోగదారులు ఇద్దరూ శిక్షార్హులేనని పేర్కొన్నారు. డాక్టర్ పొలిమెర నరసింహా మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైన విద్యార్థులు, యువత చదువును నిర్లక్ష్యం చేస్తూ తమ భవిష్యత్తును చీకట్లో నెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల ప్రభావంతో అనారోగ్య సమస్యలు, మానసిక సమస్యలు, వ్యక్తిత్వ వికాసంలో మార్పులు రావడం వల్ల వారి జీవితాలు చేజేతులారా నాశనం చేసుకుంటున్నారన్నారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, హెచ్ఎం గీత, శూలం ప్రసాద్, కొండయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

మైదుకూరు : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని అర్బన్ ఎస్ఐ ఘన మద్దిలేటి అన్నారు. శుక్రవారం స్థానిక వీఆర్ కళాశాలలో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాల్లో భాగంగా మత్తు పదార్థాల నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్ఐ మాట్లాడుతూ యువత ఎక్కువగా సరదాల కోసం మత్తు పదార్థాలైన సిగరెట్, ఆల్కాహాల్, గంజాయిలకు అలవాటు పడి జీవిత లక్ష్యాలకు దూరమవుతుతున్నారని చెప్పారు. మత్తు పదార్థాలు తీసుకున్న సమయంలో విచక్షణను కోల్పోయి అసాంఘిక పనులకు పాల్పడి చివరకు కటకటాల పాలై జైలు జీవితం అనుభవించాల్సి వస్తుందని పేర్కొన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసైన వారు ఆరోగ్య, ఆర్థిక సమస్యలతోపాటు సమాజంలో గుర్తింపును, గౌరవాన్ని కోల్పోతారన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా సాంస్కృతిక కన్వీనర్ ఖాజా హుస్సేన్ మత్తు పదార్థాలు తీసుకోవడం వలన జరిగే అనర్థాలను పాట రూపంలో వివరించారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థులతో మత్తు రహిత సమాజం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. సదస్సులో అమ్మ సేవా సమితి అధ్యక్షుడు వాగ్దాడం శివశంకర్, వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమ ట్రస్ట్ నిర్వాహకుడు వేములూరి మాలకొండయ్య ఆచారి, శ్రీ నారాయణ చారిటబుల్ ట్రస్టు ఆయి కిరణ్ రాజ్, సామాజిక ఆరోగ్య కేంద సిబ్బంది సుబ్రహ్మణ్యం, ప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ వెంకట్రాముడు, ప్రిన్సిపల్ తిరుమలయ్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణపతి నిమజ్జనం


నిమజ్జనానికి ఊరేగింపుగా తరలిన వసంతపేటలోని గణనాథుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలుప్రాంతాలలో కొలువుదీరిన బొజ్జగణపయ్యలను శుక్రవారం కొందరు గణపతి ఉత్సవ కమిటీల వారు నిమజ్జనానికి తరలించారు. ఉదయం విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించి భక్తిశ్రద్ధలతో పూజించారు. మధ్యాహ్నం కొందరు కమిటీల వారు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. అనంతరం బొజ్జగణపయ్య విగ్రహాలను ట్రాక్టర్లలోకి ఎక్కించి చెక్కభజనలు, డప్పువాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య రంగులు చల్లుకుంటూ పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక వసంతపేటలోని బాల వినాయక ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంలో లడ్డూలను రూ.20,116తో పొట్టిపాటి శ్రీనివాసులరెడ్డి, వెండి బిళ్లను రూ.16,500తో పాలగిరి చంద్రమోహన్, నోట్లదండను రూ.13,000తో పూజల వాసు చేజిక్కించుకున్నారు. గణనాధుని విగ్రహాలను పెన్నానది, చాపాడు, కామనూరు వద్ద ఉన్న కుందూ నదిలో నిమజ్జనం చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విభిన్న ప్రతిభా వంతులు వెంకట్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కలెక్టర్ శివశంకర్ లోతేటి


కలెక్టర్ శివశంకర్‌కు జ్ఞాపిక అందిస్తున్న వెంకట్

ప్రొద్దుటూరు కల్చరల్ : విభిన్న ప్రతిభా వంతులు కామిశెట్టి వెంకట్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ శివశంకర్ తెలిపారు. స్థానిక శ్రీదేవి ఫంక్షన్‌హాల్‌లో వెంకట్ ఫౌండేషన్ మూడోవ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ వెంకట్ తల్లిదండ్రుల కృషితో ప్రతిభా పాటవాలు ప్రదర్శిస్తున్నారని, ఆయన మానసిక వైకల్యాన్ని జయించి తన ప్రతిభతో అనేక మంది ప్రముఖుల నుంచి ఎన్నో అవార్డులు పొందారన్నారు. గండికోటలో నిర్వహించే పర్యాటక దినోత్సవంలో వెంకట్‌కు ప్రదర్శనకు అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి మాట్లాడుతూ వెంకట్ ప్రతిభ వెనుక తల్లిదండ్రుల ఎనలేని కృషి ఉందన్నారు. వెంకట్ తల్లిదండ్రులు విశాలాక్షి , రాధాకృష్ణ, ఆర్డీఓ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, భవిత కేంద్రాలలోని చిన్నారులు పాల్గొన్నారు.

ఆల్‌బెండజోల్ మాత్రలతో ఉపయోగం


పోస్టర్లను ప్రదర్శిస్తున్న అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : పిల్లలు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందడానికి ఆల్‌బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు కామనూరు వైద్యాధికారి డాక్టర్ హనీఫ్ బాబా, మండల విద్యాశాఖాధికారి సావిత్రమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కుళ్లాయమ్మ అధ్యక్షతన మండల టాస్క్ ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెల 17న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. డాక్టర్ హనీఫ్‌బాబా, ఎంఈఓ సావిత్రమ్మ మాట్లాడుతూ 1–19 ఏళ్ల మధ్య వయసుగల వారందరికీ ఉచితంగా నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ 400 మి.గ్రా. మాత్రలను వేస్తారన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈ మాత్రలను తప్పక వేయించాలని సూచించారు. అనంతరం అధికారులు నులిపురుగుల నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ ప్రొద్దుటూరు రూరల్ ప్రాజెక్టు సీడీపీఓ అరుణకుమారి, ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి, సీహెచ్ఓ కృష్ణమ్మ, సబ్ యూనియన్ అధికారి శ్రీనివాస్, సూపర్ వైజర్లు బీపీ వరప్రసాద్, చంద్రకళ, విజకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కళావతి, రఫియా, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్ర యాజమాన్యంతో నాణ్యమైన పంట


మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ

మైదుకూరు : టమాటా సాగులో సమగ్రమైన యాజమాన్య చర్యలతో నాణ్యమైన పంటను పొందవచ్చని మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రంలో ఉద్యాన పంటలపై నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో నాలుగో రోజు శుక్రవారం టమాటా సాగుపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ టమాటా సాగులో సమగ్ర ఎరువులు, నీటి యాజమాన్యం, కలుపు నివారణ చర్యల గురించి వివరించారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్ మాట్లాడుతూ టమాటా పంటను ఆశించే చీడపీడలు, ముఖ్యంగా వేరుకుళ్లు, ఆకు ఎండు తెగుళ్ల వాటి నివారణ గురించి తెలియజేశారు. గృహ విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ బీఎస్ కాంతిశ్రీ మాట్లాడుతూ టమాటా పంట కోత అనంతరం చర్యలు, రవాణా, విలువ ఆధారిత పదార్థాల తయారీ గురించి వివరించారు. ఆహారంలో టమాటాను చేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో వనిపెంట ఎఫ్‌పీఓ చైర్మన్ బాలనరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ


నిత్యావసర వస్తువులు అందచేస్తున్న అయూబ్‌ఖాన్

ప్రొద్దుటూరు కల్చరల్ : విజయవాడలోని సింగ్‌నగర్, పైపుల వీధి ప్రాంతాలలోని వరద బాధితులకు మన ప్రజాసేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర వస్తువులు, చీరలు పంపిణీ చేశారు. 100 కుటుంబాలకు సమితి ఆధ్వర్యంలో బియ్యం, చింతపండు, చక్కరవంటి నిత్యావసర వస్తువులతో పాటు చీరలు అందించినట్లు అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ తెలిపారు. సమితి ప్రధాన కార్యదర్శి హరియాదవ్, ఉపాధ్యక్షుడు నరసింహా, యూసుఫ్, ఫరాన్, రఫీ, సైరాభాను , మెహమూదా పాల్గొన్నారు. అలాగే దిబీసీ ప్రజా చైతన్య సమాఖ్య వారు భట్టిప్రోలు మండలంలో 500 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, లుంగీలు, టవాల్‌లు అందచేశారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, ఉపాధ్యక్షులు భాస్కర్, వేణుగోపాల్, శీను తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలగా మార్పు


ఆరో తరగతి ప్రారంభిస్తున్న రవిప్రకాష్‌రెడ్డి

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ గిరి నగర్‌లోని ఎంపీపీ పాఠశాలను ప్రాథమికోన్నత పాఠశాలగా స్థాయి పెంచుతూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. 35 మంది విద్యార్థులతో మొదలైన ఆరో తరగతిని సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, జడ్పీటీసీ ముత్యాలప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గిరినగర్ ఎంపీపీ పాఠశాలలో గణనీయంగా విద్యార్థులుండటంతో స్థాయిని పెంచాలని విజ్ఞప్తి చేశామన్నారు. గతంలో డీఈఓ అనురాధ పాఠశాలను సందర్శించి అప్‌గ్రేడ్‌కు అవసరమైన మౌలిక వసతులను పరిశీలించారని, ఇప్పుడు అనుమతి మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సీఎం.బాషా, తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి


పోరుమామిళ్లలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు


సీతారాం ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

పోరుమామిళ్ల : అలుపెరగని పోరాట యోధుడు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి అని సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. భైరవ ప్రసాద్ మాట్లాడుతూ ఏచూరి జీవితమంతా ప్రజల సేవకే వినియోగించారని, తన భౌతిక దేహాన్ని కూడా ఎయిమ్స్‌కు ఇవ్వాలన్న గొప్ప సామాజిక తత్వరుడన్నారు. ఈ కార్యక్రమంలో గౌసియాబేగం, బీబీ, ఫాతిమా, చిన్నయ్య, గురయ్య, జాకోబ్, మాల్యాద్రి, రవి, రత్నమయ్య పాల్గొన్నారు.

ఏచూరి మృతి తెలుగువారికి తీరని లోటు

పోరుమామిళ్ల : సీతారాం ఏచూరి మృతి పార్టీకే కాక, తెలుగువారికి తీరని లోటు అని పీఆర్ ఆర్డీ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏచూరిని గతంలో మూడు దఫాలు కలిశానన్నారు. మంచి వాగ్ధాటి కలిగిన పోరాట యోధుడన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

కలసపాడు : స్థానిక ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఐ, సీపీఎం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ కామ్రేడ్ సీతారాం ఏచూరి చిన్ననాటి నుంచి కమ్యూనిస్టు భావజాలానికి ఆకర్షితులై విద్యార్థి దశ నుండి కమ్యూనిస్టు పార్టీలో చేరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సుదర్శన్, సుబ్బరాయుడు, హుస్సేన్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ నర్సులను రెగ్యులర్ చేయాలి


రిలే దీక్షల్లో పాల్గొన్న కాంట్రాక్ట్ నర్సింగ్ ఉద్యోగులు

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను వెంటనే రెగ్యులర్ చేయాలని 'నర్సెస్ స్ట్రగుల్ కమిటీ'(ఎన్.ఎస్.సి) నాయకులు డిమాండ్ చేశారు. కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆవరణలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి నాలుగవ రోజుకు చేరుకున్నాయి. ఎన్ఎస్‌సీ జిల్లా అధ్యక్షురాలు బి. విజయశ్రీ, వైస్ ప్రెసిడెంట్ ఎన్.హేమలత, జనరల్ సెక్రటరీ కమాల్‌బీ, ట్రెజరర్ నారాయణ, కమ్యూనికేటర్ ఏ.సునీతలతో పాటు నర్సులు, మేల్ నర్సింగ్ సిబ్బంది ఈ దీక్షలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 14 సంవత్సరాల నుంచి రెగ్యులర్ నోటిఫికేషన్‌ను స్టాఫ్ నర్సులకు ప్రకటించలేదన్నారు. జీఓ 115లో ప్రకారం ఇప్పటికే రెగ్యులర్, కాంట్రాక్ట్‌లలో వుండి 18 నెలలు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో శిక్షణ తీసుకున్న ఎ.ఎన్.ఎంలకు రూ. 5 వేలు ఒక్కొక్కరికి ఇచ్చి.. రెగ్యులర్ ఏఎన్ఎంలను రెగ్యులర్ స్టాఫ్ నర్సులుగా, కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులుగా పదోన్నతి కల్పిస్తూ ఖాళీ స్టాఫ్ నర్సుల ఉద్యోగాలలో భర్తీ చేస్తున్నారన్నారు. దీనివలన గత 10 నుంచి 15 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ విధానంలో పని చేస్తున్న స్టాఫ్ నర్సులకు, చదువుకుని వున్న నిరుద్యోగ స్టాఫ్ నర్సులకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జీవో నెం. 115ని రద్దు చేయాలని, లేని పక్షంలో భవిష్యత్తులో జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు.

గోడలపై పోస్టర్లు, స్టిక్కర్లు అతికించరాదు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రహరీలు, ప్రైవేటు బిల్డింగులు, గోడలు, సర్కిళ్లు, డివైడర్లు, సెంట్రల్ మీడియన్లపై ఎలాంటి వాల్‌పోస్టర్లు, నోటీసులు, స్టిక్కర్లు అతికించడంగానీ, ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడం చేయకూడదని అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర అన్నారు. శుక్రవారం సినిమా థియేటర్ల యజమానులు, వివిధ మత సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నగరపాలక సంస్థ అనుమతి లేకుండా కడప నగరంలో ఎక్కడా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదని, అలా చేసిన వారిపై సీఆర్‌పీసీ సెక్షన్ 133 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బెంగళూరు, విజయవాడకు నూతన బస్సు సర్వీసులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నుండి బెంగళూరు, విజయవాడకు నూతన బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జున రెడ్డి శుక్రవారం తెలిపారు. ప్రొద్దుటూరు నుండి బెంగళూరుకు మధ్యాహ్నం 1 గంటకు కడప మీదుగా వెళుతుందని, అదే రోజు బెంగళూరు నుండి రాత్రి 11 గంటలకు ప్రొద్దుటూరుకు బస్సు బయలుదేరునని ఆయన పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నుంచి విజయవాడకు మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరుతుందని, అదే రోజు విజయవాడ నుండి మధ్యాహ్నం 2 గంటలకు ప్రొద్దుటూరుకు బస్సు బయలుదేరుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమార్

పోరుమామిళ్ల : ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో జరిగిన పోరుమామిళ్ల ప్రాంతీయ మండలాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ఇచ్చిన హామీలతో ఉద్యోగ ఉపాధ్యాయులు సహకరించారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్నిరకాల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో చెన్నయ్య, జయరామయ్య, జోజయ్య, ఈశ్వరరావు, శ్రీనివాసులు, పోరుమామిళ్ల, కాశినాయన మండలాల నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల పరిశీలన


అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

బద్వేలు అర్బన్ : బద్వేల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాలను శుక్రవారం ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, సీడీపీఓ శ్రీదేవి పరిశీలించారు. ఆయా అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు పరిశీలించారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన పోషణ వాటికల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు సాధ్యమవుతుందన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


గురుమూర్తిని సన్మానిస్తున్న సభ్యులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పెన్షనర్స్ అసోసియేషన్‌కు శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన అధ్యక్షుడిగా పాలకొలను నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మద్దిమానయ్య, కోశాధికారిగా దస్తగిరిసాహెబ్, ఉపాధ్యక్షులుగా విజయభాస్కర్‌రెడ్డి, వీరాస్వామి, సహ కార్యదర్శిగా వెంకటకృష్ణయ్య, సహాయ కోశాధికారిగా మహేశ్వరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ మార్కారెడ్డి, గౌరవ సలహాదారుగా గురుమూర్తి వ్యవహరిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు గురుమూర్తికి శాలువ, పూలదండతో ఘనంగా సన్మానించారు.

రూ.లక్ష విరాళం

ప్రొద్దుటూరు : విజయవాడ వరద బాధితుల సహాయం కోసం వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ జి.హుస్సేన్ రెడ్డి రూ.లక్ష విరాళాన్ని అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సిద్దేశ్వరరావు శుక్రవారం తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రూ.లక్ష విరాళాన్ని సీఎం సహాయ నిధికి అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి


వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

కలసపాడు : వరిలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయాధికారి జాకీర్ షరీఫ్ తెలిపారు. మండలంలోని శంఖవరం వద్ద సాగు చేసిన వరిపంటను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరిలో సుడిదోమ ఎక్కువగా ఆశించిందని, పిల్ల, పెద్ద దోమలు నీటి పైభాగంలో వరి మొదళ్ల వద్ద ఉండి రసం పీల్చడంతో పైరు లేత పసుపువర్ణంలోకి మారుతుందన్నారు.